జ్వాల తెలుగు న్యూస్

RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

PUBLISHED FROM: MEDAK | సంపుటి: 02 | సంచిక: 77 | మంగళవారం, 25 నవంబర్, 2025 | epaper.medaktoday.net | పేజీలు: 05 | వెల: 02/-

# 70 ఏళ్ల కల నెరవేరబోతుంది



- త్వరలోనే కొడంగల్ ప్రజలు రైలు కూతను వినబోతున్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.
- కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల త్వరలో నెరవేరబోతుందన్నారు.
- మరో తొమ్మిది నెలల్లో రైల్వే లైన్ ఏర్పాటు పనులు ప్రారంభంకానున్నాయన్నారు.

## భర్తపై పెట్రోల్ పోసి చంపేసిన ఇద్దరు భార్యలు


- నిజామాబాద్ జిల్లా దేవక్కపేటలో సోమవారం దారుణ ఘటన చోటుచేసుకుంది.
- మోహన్ అనే వ్యక్తిని అతని ఇద్దరు భార్యలు కవిత, సంగీతలు అతి కిరాతకంగా హత్య చేశారు.
- భర్త వేధింపులు తట్టుకోలేక తరచూ గొడవలు
- ఈ గొడవ తీవ్రరూపం దాల్చింది.
- దీంతో ఆగ్రహించిన ఇద్దరు భార్యలు ఏకమై మోహన్ ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు.
- తీవ్ర గాయాలైన మోహన్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.
- పోలీసులు కేసు నమోదు చేసి.. కుటుంబ కలహాలు, వేధింపుల కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



## 'హైదరాబాద్ వచ్చాను.. ఇంటికి రా మామ'

### ఈ ఒక్క మెసేజ్ ఐబొమ్మ రవిని పట్టించింది.

- ఆరేళ్లలో కోట్లు సంపాదించిన రవి..
- దేశ విదేశాల్లో ఏజెంట్లను, సర్వర్లను ఉపయోగించి పైరసీ సామ్రాజ్యాన్ని నడిపాడు.
- తనను పట్టుకోలేరని పోలీసులకు సవాల్ విసిరాడు.
- చివరకు.. ఒక ఈ-మెయిల్ లింక్ ఆధారంగా పోలీసులు నిఘా పెట్టి, రవి హైదరాబాద్‌కు వచ్చినట్లు నిర్ధారించుకున్నారు.
- మిత్రుడికి పంపిన 'మామా హైదరాబాద్ వచ్చా' అనే ఒకే ఒక్క మెసేజ్ ఆధారంగా కూకట్‌పల్లిలో అతడిని అదుపులోకి తీసుకున్నారు.
- ప్రస్తుతం రవి పోలీసుల కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్నాడు
- కానీ విదేశీ డేటా గురించి సమాధానాలు దాటవేస్తున్నాడు.




## రేషన్ కార్డు ఉంటే మీ ఇంటికే చీర



- 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు అందజేస్తాం
- త్వరలో ప్రతి మండలానికి క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు
- పంపిణీ పారదర్శకంగా జరగాలని మహిళలు కోరుతున్నారు.
- మంత్రి పొన్నం

# సైరన్ లేకుండా సీపీ సజ్జనార్ సైలెంట్ గస్తీ.

- అర్ధరాత్రి రౌడీ షీటర్లను నిద్రలేపి ఊహించని షాక్..!
- పెట్రోలింగ్ వాహనంలో సీపీ సజ్జనార్
- అర్ధరాత్రి రౌడీ షీటర్లకు ఊహించని షాక్
- నేర ప్రవృత్తి వీడాలంటూ రౌడీ షీటర్లకు హితవు



హైదరాబాద్ నగర భద్రతా ప్రమాణాలను పెంపొందించడం, క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది అప్రమత్తతను పరిశీలించడం లక్ష్యంగా నగర కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదివారం (నవంబర్ 23) అర్ధరాత్రి ఆకస్మిక గస్తీ నిర్వహించారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా.. సైరన్ లేకుండా పెట్రోలింగ్ వాహనంలోనే స్వయంగా పర్యటించిన ఆయన రౌడీ షీటర్లకు ఊహించని షాక్ ఉస్తూ.. వారి ఇళ్లకు వెళ్లి ప్రస్తుత జీవన విధానంపై ఆరా తీశారు. సజ్జనార్ తన ఆకస్మిక పర్యటనలో భాగంగా మొదట లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎండీ లైన్స్, ఆశాం నగర్, డిఫెన్స్ కాలనీల్లోని రౌడీ షీటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లారు. ఇంట్లోనే ఉన్న రౌడీ షీటర్లను నిద్రలేపిన సీపీ.. వారి నేర చరిత్ర, ప్రస్తుత జీవనశైలి, ఉపాధి పరిస్థితులు, సామాజిక వ్యవహార ధోరణులపై సమగ్రంగా ఆరా తీశారు. మళ్లీ నేరాల వైపు అడుగు వేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన గట్టిగా హెచ్చరించారు. అంతేకాకుండా నేర ప్రవృత్తి వీడి సన్మార్గంలోకి రావాలని వారికి హితవు పలికారు.

## నవంబర్ 26న ఈ ఏరియాల్లో నీళ్లు బంద్..

- హైదరాబాద్ జంట నగరాలకు కీలకమైన కృష్ణా ఫేజ్-1, 2, 3 పంపింగ్ స్టేషన్ల పరిధిలో నవంబర్ 26, బుధవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది.
- విద్యుత్ బల్క్ ఫీడర్ల నిర్వహణ, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల మార్పిడి పనుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందని వాటర్ బోర్డు ప్రకటించింది.
- చార్మినార్, కూకట్‌పల్లి, ఎస్.ఆర్. నగర్, హయత్ నగర్, ఉప్పల్, మణికొండ వంటి 17 ప్రాంతాల్లో ఈ అంతరాయం
- ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నీటిని నిల్వ చేసుకోవాలని వాటర్ బోర్డు సూచించింది.

## మహిళల కబడ్డీ వరల్డ్ కప్ విజేత భారత్

- మహిళల కబడ్డీ ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత్
- ఫైనల్‌లో చైనీస్ తైపీపై 35-28 తేడాతో విజయం
- భారత జట్టుకు ఇది వరుసగా రెండో ప్రపంచకప్ టైటిల్
- టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శనతో అజేయంగా నిలిచిన టీమిండియా
- భారత జట్టు ప్రదర్శనపై ప్రశంసలు కురిపించిన కబడ్డీ ప్రముఖులు



# 70 ఏళ్ల కల నెరవేరబోతుంది

కొడంగల్, నవంబర్ 24: ఆడబిడ్డలు సంతోషంగా ఉంటే.. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కొడంగల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆడబిడ్డల ఆత్మగౌరవంతో బతికేలా ఉండాలని తమ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. ప్రతి పేద తల్లి కళ్లల్లో ఆనందం చూడాలని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. అదానీ, అంబానీలతో పోటీ పడేలా సోలార్ ప్లాంట్స్ నిర్వహణను మహిళలకు అప్పగించామని వివరించారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించామని వివరించారు. హైటెక్ సిటీ శిల్పారామంలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు స్టాల్స్ సైతం ఏర్పాటు చేశామని వివరించారు. ఆడబిడ్డలు తయారు చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేందుకు అమెజాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు. మీ జీవితాల్లో వెలుగులు నింపేందుకు మంచి చదువు అందించడం ఒక్కటే మార్గమని సూచించారు. మీ పిల్లలు గొప్పగా చదువుకుంటేనే మీ జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అందుకే అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో 28 వేల మంది విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. ఏ విద్యార్థి ఆకలితో ఇబ్బంది పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమం తీసుకువస్తున్నామన్నారు. బిడ్డల గురించి కన్నతల్లి ఆలోచించినట్లుగా%ొ% తమ ప్రభుత్వం ఆలోచించి వారి ఆకలి తీరుస్తోందని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలకు తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి మెడికల్, వెటర్నరీ, అగ్రి, పారామెడికల్, నర్సింగ్, ఇంజనీరింగ్ కళాశాలలు , ఏటీసీలను, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలలు, సైనిక్ స్కూల్ తీసుకొచ్చామని వివరించారు. విద్య ఒక్కటే తరగని ఆస్తి అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి గొప్ప చదువుల కోసం కొడంగల్‌కు వెళ్లాలనేలా ఈ అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. 16 నెలల్లో అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్‌ను మార్చాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నారని చెప్పారు. మూడేళ్లల్లో ప్రాజెక్టు పూర్తి చేసి కొడంగల్ భూములను కృష్ణా జలాలతో తడుపుతామని విశ్వాసం వ్యక్తం చేశారు . లగచర్ల పారిశ్రామిక వాడను అంతర్జాతీయ పారిశ్రామిక వాడగా తీర్చి దిద్దుతామని స్పష్టం చేశారు. త్వరలోనే కొడంగల్ ప్రజలు రైలు కూతను కూడా వినబోతున్నారన్నారు. కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతుందన్నారు. మరో తొమ్మిది నెలల్లో రైల్వే లైన్ ఏర్పాటు పనులు ప్రారంభంకానున్నాయని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమలు సైతం ఏర్పాటు కాబోతున్నాయని వివరించారు. అభివృద్ధిలో కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఒక మోడల్‌గా మారుస్తామని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోండంటూ ప్రజలకు సూచించారు. ఆడబిడ్డలకు ప్రభుత్వం అందిస్తున్న సారె ఇందిరమ్మ చీరలని.. ఇవి ప్రతి ఆడబిడ్డకు చీర చేరేలా చూడాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. రాజకీయాలకు అతీతంగా కొడంగల్‌ను అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు రావాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధికి అండగా ఉండాలని ఈ సందర్భంగా ఆడబిడ్డలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## 'హైదరాబాద్ వచ్చాను.. ఇంటికి రా మామ'

# ఈ ఒక్క మెసేజ్ ఐబొమ్మ రవిని పట్టించింది.

తెలుగు సినీ పరిశ్రమలో కొన్నేళ్లుగా తీవ్ర చర్చకు దారితీసిన అంశం పైరసీ. ముఖ్యంగా కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యే పరిస్థితి నిర్మాతలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఈ పైరసీ సామ్రాజ్యానికి రాజుగా.. ట్రెండ్ సెట్టర్‌గా వెలుగొందిన వ్యక్తే ఐబొమ్మ ఇమంది రవి. తెలుగు రాష్ట్రాల్లో సోషల్ మీడియాల ద్వారా.. అనధికార వెబ్‌సైట్ల ద్వారా ఈయన సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. కేవలం ఆరేళ్ల స్వల్ప వ్యవధిలో పైరసీ ద్వారా కోట్ల రూపాయల అక్రమ సంపదను కూడబెట్టాడు. సాంకేతిక పరిజ్ఞానంపై రవికి ఉన్న అపారమైన పట్టు.. అతన్ని సైబర్ నేరాల ప్రపంచంలో కింగ్‌మేకర్‌గా మార్చింది. తన పైరసీ కార్యకలాపాలను కేవలం దేశీయంగా కాకుండా.. అంతర్జాతీయ స్థాయిలో విస్తరించాడు. దేశ, విదేశాల్లో వందలాది మంది ఏజెంట్లను నియమించుకుని, ఒక పటిష్టమైన నెట్‌వర్క్‌ను రూపొందించాడు. అతడి పైరసీ వ్యాపారం గుట్టు విదేశాల్లోని సర్వర్లలో నిక్షిప్తమై ఉండేది. యునైటెడ్ కింగ్‌డమ్ , కరేబియన్ దీవుల వంటి ప్రాంతాల నుంచి కూడా ఈ కార్యకలాపాలను నిర్వహించడానికి సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. డేటా అంతా విదేశాల్లో ఉండటం వలన, తనను పట్టుకోవడం పోలీసులకు అంత సులభం కాదనే ధీమాతో రవి ఉండేవాడు. ఐబొమ్మ వెబ్‌సైట్ పై నిఘా పెట్టిన సైబర్ క్రైమ్ పోలీసులకు.. ఆ వెబ్‌సైట్ నిర్వాహకుడు సవాల్ విసిరి మరింత ఆగ్రహాన్ని తెప్పించాడు. తమపై దృష్టి పెట్టడం ఆపాలని నేరుగా పోలీసులకే సవాల్ విసిరాడు. ఈ సవాల్‌ను స్వీకరించిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు, రవి కదలికలపై సుమారు మూడు నెలల పాటు అత్యంత గోప్యంగా నిఘా పెట్టారు. రవి ఎంతటి సాంకేతిక నిపుణుడైనా.. ఏదో ఒక ఆధారం వదిలేస్తాడనే సూత్రాన్ని పోలీసులు నమ్మారు. చివరకు.. ఒక కీలకమైన ఈ-మెయిల్ లింక్ ఆధారంగా నిందితుడి ఆచూకీని పసిగట్టారు. రవి.. ఈఆర్ ఇన్ఫోటెక్ అనే కంపెనీ పేరుతో డొమైన్‌లను కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఈ డొమైన్ రిజిస్ట్రేషన్ల ద్వారా లభించిన ఫోన్ నంబరు ఆధారంగా.. రవి ఎవరెవరితో సంభాషిస్తున్నాడో, ఎలాంటి లావాదేవీలు చేస్తున్నాడో పోలీసులు విశ్లేషించడం మొదలుపెట్టారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. రవి ఎక్కువ సమయం విదేశాల్లోనే గడిపేవాడు. అరుదుగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్న తన నివాసానికి వచ్చేవాడు. ఈ-మెయిల్ లింకుల ద్వారా పోలీసులు, రవికి నగరంలో ఉన్న అత్యంత సన్నిహితుడైన మిత్రుడిని గుర్తించారు. ఆ మిత్రుడి ఫోన్ నంబర్‌ను సేకరించి.. రవి హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా తమకు సమాచారం అందేలా రహస్యంగా ఏర్పాటు చేసుకున్నారు. పోలీసుల వేట ఫలించింది. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న రవి.. తన మిత్రుడికి ఒక మెసేజ్ పంపాడు. 'మామా హైదరాబాద్ వచ్చా.. అంటూ కూకట్‌పల్లిలోని తన ఇంటికి రావాలని స్నేహితుడిని ఆహ్వానించాడు. ఈ ఒక్క మెసేజ్ ద్వారా రవి నగరంలో ఉన్నట్లు కచ్చితంగా నిర్ధారించుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు, క్షణం ఆలస్యం చేయకుండా కూకట్‌పల్లిలోని నివాసానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో రవి పొంతన లేని సమాధానాలు ఇస్తూ.. తన విదేశీ సర్వర్ల వివరాలు, సిబ్బంది గురించి అడిగిన ప్రతిసారీ సమాధానం దాటవేస్తున్నట్లు సమాచారం. అయితే.. తన పైరసీ వ్యాపారం ఏదో ఒక రోజు బయటపడుతుందని తనకు తెలుసని, కానీ ఇంత త్వరగా పట్టుబడతానని ఊహించలేదని మాత్రం పోలీసు అధికారులతో చెప్పినట్లు తెలిసింది. రవిని నాంపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రస్తుతం పోలీసులు రవిని ఐదు రోజుల కస్టడీకి తీసుకుని లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# నవంబర్ 26న ఈ ఏరియాల్లో నీళ్లు బంద్..

హైదరాబాద్ మహానగరంలో నివసించే ప్రజలకు జలమండలి ముఖ్య సమాచారాన్ని అందించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో నవంబర్ 26, బుధవారం నాడు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రకటించింది. జంట నగరాలకు తాగునీటిని అందించడంలో అత్యంత కీలకమైన కృష్ణా ఫేజ్-1, 2, 3 పంపింగ్ స్టేషన్ల పరిధిలో ఈ అంతరాయం కలగనుంది. ఈ నీటి సరఫరా అంతరాయానికి ప్రధాన కారణం విద్యుత్ శాఖ చేపట్టే నిర్వహణ పనులే. కృష్ణా పంపింగ్ స్టేషన్లకు నీటిని తరలించే బల్క్ ఫీడర్లలో ఏర్పడిన లోపాలను సరిదిద్దడం.. దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడం వంటి పనులను అధికారులు చేపట్టనున్నారు. ఈ విద్యుత్ నిర్వహణ పనులు విజయవంతమైతే.. భవిష్యత్తులో పంపింగ్ స్టేషన్లలో తరచూ ఎదురయ్యే విద్యుత్ అంతరాయ సమస్యలను నివారించవచ్చు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం వల్ల పంపింగ్ ఆగిపోయి.. నీటిని శుద్ధి చేసే కేంద్రాల నుంచి ట్యాంకులను, అక్కడి నుంచి గృహాలకు నీరు చేరడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ నిర్వహణ పనుల కారణంగా కృష్ణా ప్రాజెక్టు ద్వారా నీటిని సరఫరా చేసే పలు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తగా నీటిని నిల్వ చేసుకోవాలని మెట్రో వాటర్ బోర్డు సూచించింది. కృష్ణా జలాల ప్రాజెక్టు అనేది గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాలకు, అలాగే ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని విస్తరిస్తున్న శివారు ప్రాంతాల గ్రామాలకు కూడా తాగునీటిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిపై ఆధారపడిన ప్రాంతాల్లో బుధవారం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ సందర్భంగా జలమండలి అధికారులు మాట్లాడుతూ.. ప్రజలకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని.. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి, ఆ తర్వాత రోజు నుంచి పూర్తి స్థాయిలో నీటి సరఫరాను పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. బుధవారం సాయంత్రం లేదా గురువారం ఉదయం నాటికి నీటి సరఫరా సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉంది. హైదరాబాద్‌లోని కింది ప్రాంతాల్లో నవంబర్ 26న నీటి సరఫరాలో అంతరాయం ఉండనుంది. చార్మినార్, వినయ్ నగర్, భోజగుట్ట, రెడ్ హిల్స్, నారాయణగూడ, ఎస్ ఆర్ నగర్, మారేడ్‌పల్లి, రియాసత్ నగర్, కూకట్‌పల్లి,సాహెబ్ నగర్, హయత్ నగర్, సైనిక్ పురి, ఉప్పల్, హఫీజ్ పేట్, రాజేంద్ర నగర్, మణికొండ, బోడుప్పల్, మీర్‌పేట్. ఈ ప్రాంతాల ప్రజలు రెండు రోజుల పాటు సరిపడా నీటిని ముందుగానే నిల్వ చేసుకోవడం మంచిది.

# బీజేపీ మిషన్ బెంగాల్ ప్లాన్

న్యూఢిల్లీ: మొన్న న్యూఢిల్లీ, నిన్న బిహార్‌లో వరుస ఘన విజయాలను సాధించిన భారతీయ జనతా పార్టీ ఇప్పుడు పశ్చిమబెంగాల్‌పై దృష్టి సారిస్తోంది. 'మిషన్ బెంగాల్'కు సమగ్ర వ్యూహం రూపొందిస్తోంది. 160 ప్లస్ సీట్లు లక్ష్యంగా బెంగాల్ కంచుకోటను సొంతం చేసుకోవడమే ఈ ప్లాన్ లక్ష్యం. ఇందుకోసం సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడం, ఆనువంశ రాజకీయాలు, క్షీణిస్తున్న శాంతి భద్రతలను ఎండగట్టడం ద్వారా సీట్లు, ఓట్ షేర్ పెంచుకునేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం. వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. ఈసారి ఎన్నికల్లో మమతాబెనర్జీ కంటే ఆమె రాజకీయ వారసుడిగా భావిస్తున్న అభిషేక్ బెనర్జీపై ప్రధానంగా బీజేపీ దృష్టి సారించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఆనువంశిక రాజకీయాలను టార్గెట్ చేసుకోనుంది. అభిషేక్ పట్ల పెద్దగా విధేయత లేని కార్యకర్తలను తమ వైపు ఆకట్టుకోవడం ద్వారా టీఎంసీకి ఉన్న ప్రధాన ఓటర్ బేస్‌ను దెబ్బతీయవచ్చని భావిస్తోంది. పార్టీ ఫిరాయింపుదారుల కంటే కార్యకర్తలపైనే ప్రధానంగా దృష్టి సారించాలనుకుంటోంది. 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కీలక తృణమూల్ నేతలను ఆకర్షించేందుకు కమలనాథులు ప్రయత్నాలు సాగించారు. టీఎంసీలో అభిషేక్ బెనర్జీకి పెరుగుతున్న ఆధిపత్యంపై అసంతృప్తితో ఉన్న కీలక టీఎంసీ నేత, మమతా బెనర్జీకి కుడిభుజమైన సువేందు అధికారిని విజయవంతంగా పార్టీలోకి రప్పించింది. అయితే ఈసారి ఫిరాయింపుదారులను పార్టీలోకి చేర్చుకునే ఆలోచన బీజేపీకి అంతగా లేదని అంటున్నారు. బెంగాల్‌లో తమ పార్టీ ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగిందని బీజేపీ భావిస్తుండటమే ఇందుకు కారణం. అందువల్ల పార్టీ సీనియర్ నేతలు మాత్రమే నాయకత్వం వహించేలా ప్రచారం సాగించి, ఐక్యతా సందేశం పంపాలని పార్టీ యోచనగా ఉంది. సమష్టి నాయకత్వం, మోదీ పనితీరుపై ఆధారపడి ఎన్నికలకు వెళ్లాలని భావిస్తోంది. బెంగాల్ ఎన్నికలకు ఈసారి విభిన్న ఫార్ములాతో వెళ్లాలని బీజేపీ భావిస్తోంది. కుల రాజకీయాల ప్రభావం బెంగాల్‌పై పెద్దగా ప్రభావం ఉండదని, ఆ కారణంగా ప్రాంతీయ, మతపరమైన ఈక్వేషన్లను బ్యాలెన్స్ చేస్తూ ముందుకు వెళ్లాలనుకుంటోంది. బెంగాల్ జనాభాలో సుమారు 30 శాతం ముస్లింలు ఉన్నారు. అయితే 30-40 సీట్లలోనే ముస్లింలు గణనీయంగా ఉన్నారు. ఇక్కడి నుంచే తృణమూల్‌కు పెద్ద సంఖ్యలో ఓట్లు పడుతున్నాయి. అయితే ఈ ప్రభావం ఓవరాల్ గెలుపు సీట్లపై పెద్దగా ఉండదని బీజేపీ యోచనగా ఉంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాల్లో పోలరైజేషన్‌తో హిందూ ఓటర్లను తమవైపు తిప్పుకోవచ్చని అభిప్రాయపడుతున్నట్టు తెలుస్తోంది. ముస్లింలను సంతృప్తి పరచడం వంటి ఆరోపణలతో టీఎంసీని ఇరుకున పెట్టాలని వ్యూహరచన చేస్తోంది. గత నాలుగు ఎన్నికల్లో (2 రాష్ట్ర ఎన్నికలు, రెండు జాతీయస్థాయి ఎన్నికలు) బీజేపీ 100కు పైగా సీట్లు సాధించుకుందని ఆ పార్టీ చెబుతోంది. తద్వారా రాష్ట్రంలో పార్టీ బలంగా వేళ్లూనుకుందని, పార్టీని మరింత పటిష్టం చేయడం ద్వారా బెంగాల్‌పై పట్టు సాధించడం, 160 ప్లస్ సీట్లు సాధించడం పెద్ద కష్టం కాకపోవచ్చని బీజేపీ అంచనాగా ఉంది. ఇంతవరకూ బీజేపీ బెస్ట్ బెంగాల్ షోగా (సీట్లు, ఓట్లుపరంగా) 2019 లోక్‌సభ ఎన్నికలను చెప్పుకోవచ్చు. ఈ ఎన్నికల్లో బెంగాల్‌లో 18 సీట్లు గెలుచుకోవడం ద్వారా 40.25 శాతం ఓట్ షేర్ సాధించింది. 2012 రాష్ట్ర ఎన్నికల్లో పార్టీ 77 సీట్లు దక్కించుకుని 38.14 శాతం ఓట్ షేర్ రాబట్టింది. తృణమూల్ పరంగా చూసినప్పుడు అత్యుత్తమ ఓట్ షేర్ 48 శాతం మాత్రమేనని, బీజేపీ అదనంగా మరో 6 శాతం ఓట్లు గెలిస్తే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు సులభసాధ్యమేనని బీజేపీ అంచనా వేస్తోంది.

## మహిళల కబడ్డీ వరల్డ్ కప్ విజేత భారత్

భారత మహిళల కబడ్డీ జట్టు మరోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ఢాకా వేదికగా జరిగిన మహిళల కబడ్డీ ప్రపంచకప్ ఫైనల్‌లో చైనీస్ తైపీ జట్టుపై భారత్ 35%-%28 తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత జట్టు వరుసగా రెండోసారి ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకుని కబడ్డీ క్రీడలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ టోర్నమెంట్ ఆసాంతం భారత జట్టు అద్భుత ఫామ్‌ను కొనసాగించింది. తమ గ్రూప్ మ్యాచ్‌లన్నింటిలోనూ గెలిచి సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో ఇరాన్‌పై 33%-%21 తేడాతో గెలిచి ఫైనల్‌లో అడుగుపెట్టింది. మరోవైపు, చైనీస్ తైపీ కూడా తమ గ్రూపులో అజేయంగా నిలిచి, సెమీస్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరింది. పుణెరి పల్టన్ హెడ్ కోచ్ అజయ్ ఠాకూర్ మాట్లాడుతూ, "భారత మహిళల జట్టు ప్రపంచకప్‌ను నిలబెట్టుకోవడం గర్వకారణం. ఫైనల్ వరకు వారి ఆధిపత్యం చూస్తే, గత కొన్నేళ్లుగా మహిళల కబడ్డీ ఎంతగా అభివృద్ధి చెందిందో అర్థమవుతుంది. బంగ్లాదేశ్‌లో ఈ టోర్నీ జరగడం కబడ్డీకి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణకు నిదర్శనం" అని వివరించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 11 దేశాలు పాల్గొనడం విశేషం. ఈ విజయంపై హర్యానా స్టీలర్స్ హెడ్ కోచ్ మన్‌ప్రీత్ సింగ్ స్పందిస్తూ, "మహిళల జట్టు దేశం గర్వపడే ప్రదర్శన ఇచ్చింది. వారి ఆత్మవిశ్వాసం, జట్టుగా ఆడిన తీరు అద్భుతం. ఒక మాజీ క్రీడాకారుడిగా, ఈ స్థాయికి చేరుకోవడం ఎంత కష్టమో నాకు తెలుసు. క్రీడాకారులకు, సిబ్బందికి నా అభినందనలు" అని తెలిపారు.

## సైరన్ లేకుండా సీపీ సజ్జనార్ సైలెంట్ గస్తీ.

రౌడీ షీటర్లలో మార్పు తీసుకురావడానికి, వారి జీవనశైలిని మెరుగుపరచడానికి పోలీసులు చేపడుతున్న 'పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్'లో భాగంగా ఈ చర్యలు కీలకంగా మారాయి. ఆదివారం రాత్రి 12 గంటల నుంచి 3 గంటల వరకు సౌత్ వెస్ట్ జోన్‌లో సీపీ పర్యటన కొనసాగింది. లంగర్ హౌస్, టోలిచౌకి పోలీస్ స్టేషన్ల పరిధిలోని రహదారులు, కీలక ప్రాంతాలు, సున్నితమైన పాయింట్లను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. టోలిచౌకి పరిధిలో రాత్రిపూట తెరిచి ఉన్న హోటళ్లు, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల్లోకి వెళ్లిన సీపీ.. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో షాపులు తెరిచి ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు, అధికారులను స్వయంగా కలుసుకుని, పెట్రోలింగ్ సిబ్బంది ఎంత మేర అప్రమత్తంగా ఉన్నారు, ప్రజల భద్రత కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు అనే అంశాలపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. గస్తీ పాయింట్లు, స్పందన వేగం, సమస్యల పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, టోలిచౌకి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ స్టేషన్ జనరల్ డైరీ, రాత్రి చేసిన ఎంట్రీలు, డ్యూటీలో ఉన్న సిబ్బంది హాజరు వివరాలు, వారికి అప్పగించిన బాధ్యతలను సమగ్రంగా పరిశీలించారు. సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ... రాత్రి వేళల్లో పోలిసింగ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎలా స్పందిస్తున్నారన్న విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆకస్మిక పర్యటనలు చేస్తున్నట్లు తెలిపారు. పీపుల్ వెల్ఫేర్ పోలిసింగ్‌లో భాగంగా చేపడుతున్న ఈ పర్యటనలు సిబ్బంది బాధ్యతా భావాన్ని పెంపొందించడమే కాకుండా, సేవల నాణ్యతను మెరుగుపరుస్తాయని ఆయన పేర్కొన్నారు. నగరంలో నేరాలపై కఠినమైన పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు స్పష్టం చేస్తూ.. హైదరాబాద్ నగర భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి సమస్యకు వెంటనే స్పందించే విధంగా బృందాలు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు.

## రేషన్ కార్డు ఉంటే మీ ఇంటికే చీర

తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తోంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ.. ముఖ్యంగా ఆడబిడ్డల ఆర్థిక స్వావలంబనపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించింది. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగి.. 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు ఈ చీరలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సిద్దిపేట జిల్లాలోని కోహెడలో జరిగిన ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత లక్ష్యంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. తెల్ల రేషన్ కార్డు కలిగి.. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఇందిరా మహిళా శక్తి పేరుతో చీరలను పంపిణీ చేస్తామని.. మహిళా సంఘంలోని మహిలళే ఇంటికి వచ్చి బొట్టు పెట్టి అందజేస్తారన్నారు. ఆడబిడ్డలకు ఏ కష్టం రానివ్వమని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక సంక్షేమ కార్యక్రమాలను వేగంగా ప్రారంభించిందని తెలిపారు. మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు.. వారికి పది సంవత్సరాల పాటు వడ్డీలేని రుణాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా.. మహిళా సంఘాలు ఆర్థిక వృద్ధిని సాధించేందుకు వీలుగా పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తున్నామని వివరించారు. ఈ చీరల పంపిణీ అనేది పథకం మాత్రమే కాదని.. మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవాన్ని, వారికి అందించే 'సారె' (బహుమతి)ని సూచిస్తుందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా.. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు అందిస్తామని ప్రకటించినప్పటికీ... క్షేత్ర స్థాయిలో కొన్ని గ్రామాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల అధికారులు మహిళా సంఘంలో సభ్యత్వం ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తుండటం, రేషన్ కార్డు ఉన్నప్పటికీ సంఘంలో లేని అర్హులైన మహిళలకు చీరలు అందకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం.. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ చీరలు పంపిణీ చేయాలని స్పష్టం చేస్తున్నప్పటికీ.. పంపిణీ ప్రక్రియలో లోపాల వల్ల కొంతమంది అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆయా గ్రామాల మహిళలు తమ నిరాశను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి.. క్షేత్ర స్థాయిలో పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా.. సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని మహిళా లోకం కోరుతోంది.

## భర్తపై పెట్రోల్ పోసి చంపేసిన ఇద్దరు భార్యలు

తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. దేవక్కపేట గ్రామంలో భర్త వేధింపులు భరించలేక ఇద్దరు భార్యలు కలసి అతడిని చిత్రహింసలకు గురిచేసి.. అనంతరం అమానుషంగా చంపిన ఉదంతం కలకలం సృష్టించింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. దేవక్కపేటకు చెందిన మోహన్ అనే వ్యక్తికి కవిత, సంగీత అనే ఇద్దరు భార్యలు ఉన్నారు.ఇద్దరు భార్యలతో జీవిస్తున్న మోహన్ ఇంట్లో నిత్యం కుటుంబ కలహాలు, గొడవలు జరుగుతుండేవని స్థానికులు చెబుతున్నారు. వీరి మధ్య తరచూ మనస్పర్థలు, ఘర్షణలు చోటుచేసుకోవడం పరిపాటిగా ఉండేది. అయితే.. సోమవారం కూడా వీరి మధ్య మరోసారి గొడవ మొదలైంది. ఈ వాగ్వాదం క్రమంగా తీవ్రరూపం దాల్చి.. అఘాయిత్యానికి దారితీసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మోహన్ తన ఇద్దరు భార్యలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసేవాడని తెలుస్తోంది. రోజువారీ వేధింపులు, గొడవలు భరించలేని ఆ ఇద్దరు భార్యలు విపరీతమైన కోపంతో, ఆగ్రహంతో ఏకమయ్యారు. ఇద్దరు భార్యలు తమ భర్త వేధింపులు తట్టుకోలేక.. పగ తీర్చుకోవాలనే ఉద్దేశంతో అత్యంత క్రూరమైన చర్యకు పాల్పడ్డారు. గొడవ తీవ్ర స్థాయికి చేరిన తరువాత.. ఇద్దరూ కలిసి మోహన్ ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో మోహన్ మంటల్లో చిక్కుకుని తీవ్ర గాయాల పాలయ్యాడు. మోహన్ అరుపులు విని స్థానికులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. గాయపడిన మోహన్‌ను వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహన్ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ దారుణ ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే దేవక్కపేటకు చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి.. స్థానికులను, కుటుంబ సభ్యులను విచారించారు. మోహన్ మరణంతో ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మోహన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనతో దేవక్కపేట గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఇద్దరు భార్యలు ఇంతటి దారుణానికి ఒడిగట్టడానికి గల కారణాలను తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన చేగుంట బిఆర్ఎస్ నాయకులు



**చేగుంట నవంబర్ 24 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలకేంద్రంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన చేగుంట మండల బిఆర్ఎస్ నాయకులు లబ్ధిదారు లు గోలే రాందాస్ పులిమామిడి 5400, మాదోత్ ధోళి తిమ్మాయపల్లి 1500, కరంతోత్ మోహన్ చెట్ల తిమ్మాయిపల్లి 10500, బ్యాగరీ మైసమ్మ బోనాల కొండాపూర్ 60,000, రెడ్డిపల్లి కనకరాజు మక్కా రాజుపేట 18000, అంబర్ పేట్ నారాయణ చెట్ల తిమ్మాయిపల్లి 13500, కొంగోలి యాదిరెడ్డి చెట్ల తిమ్మాయిపల్లి 16500, ఊరడి నాగలక్ష్మి కరీంనగర్ 15000, అక్కల అనసూయ చేగుంట 60,000, గో గో లో త్ లలిత అనంతసాగర్ 31000, శంభుని నర్సమ్మ రెడ్డిపల్లి 28500, సాదుల్లా చేగుంట 60,000, 12 మంది లబ్ధిదారులకు సుమారు 3 82,000 రూపాయల చెక్కులను అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, చేగుంట మండల మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు మంచికర్ల శ్రీనివాస్ ,బాపు రెడ్డి,చేగుంట మండల బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు అన్నం రవి,డిష్ రాజు,మహమ్మద్ అలీ, మహేష్,సురేష్,మోహన్ నాయక్, అంజిరెడ్డి తదితరులు పాల్గొని సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.

# జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో విత్తన చట్టం అవగాహన కార్యక్రమం




**మెదక్, నవంబర్ 24, (మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి):** సోమవారం మెదక్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గల జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా కమిటీ అవగాహన కార్యక్రమంలో మరియు అభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా ప్రస్తుత వ్యవసాయ సాగు పరిస్థితులకు భారత ప్రభుత్వం నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా ప్రతిపాదించడం జరిగింది. ఈ ప్రతిపాదించిన చట్టం ద్వారా నాణ్యమైన విత్తనాలు మరియు నర్సరీ మొక్కల యొక్క నాణ్యతను సరైన విధంగా నియంత్రించాలని ఉద్దేశంతో ముఖ్యంగా రైతులకు నాణ్యమైన విత్తనాలను పెద్ద ఎత్తున అందించాలని కారణాలతో మరియు నాణ్యతా లోపం, నకిలీ విత్తనాలను పూర్తి అరికట్టాలని విత్తనాలు దిగుమతిని కూడా సరళీకరించడానికి మరియు రైతు హక్కులను, పూర్తిగా పరిరక్షించాలని ఉద్దేశంతో ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగింది. విత్తన చట్టం అమలు చేయాలనే భాగంలో వాణిజ్య సరళీకరణ మరియు ఇట్టి చట్టానికి ఎవరైనా ఉల్లంఘనల జరిపినప్పుడు వాటి కారణమైన వారిని పూర్తిగా శిక్ష అర్హులు చేయడానికి కూడా వెనకాడబోమనీ తెలియజేశారు. ఈ చట్టంలో వివిధ నిబంధనలు పొందుపరచడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి కే.దేవ్ కుమార్ తెలిపారు. పార్లమెంటులో ఆమోదించడానికి ముందుగా వివిధ లబ్ధిదారులతో మరియు ప్రయోజన కారులతో చర్చలు చేపట్టి వారి ద్వారానే వచ్చే సలహాలు మరియు సూచనలను తీసుకొని ఈ బిల్లులో మార్పులు చేసి తర్వాత ఆమోదించడం జరుగుతుందని చర్చించారు. ఈ ప్రతిపాదిత చట్టంలో మొత్తం పది అధ్యాయాలు మరియు 48 విభాగాలు ఉన్నాయని అని అన్నారు. ఈ చట్టంలో కేవలం ప్రభుత్వం ద్వారా నోటిఫై అయిన రకాల విత్తనాలు మాత్రమే నియంత్రించ గలిగే అధికారం ఉంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ కె.రాహుల్ విశ్వకర్మ, వ్యవసాయ పరిశోధనల స్థానం బసంత్ పూర్ ప్రధాన శాస్త్రవేత్త డా.ఎం. విజయ్ కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకు విన్సెంట్ వినయ్ కుమార్, వ్యవసాయ అధికారులు డి . వందన, ఎం.యాదగిరి, ఏ.హర్షా, పి.నాగ మాధురి, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ పృధ్వీరాజ్, రిషి హైబ్రిడ్ సీడ్స్ కంపెనీ తరఫున డా.ఎ.కృపాకర్ రెడ్డి, ఏ డి ఏ ఎం, క్రాప్ సైన్స్ తరఫున ఎ.ప్రకాష్ రావు, ఎఫ్ పి ఓ, మంజీర కార్యనిర్వాహణ అధికారి ఎస్.కొమరయ్య, సెక్రెటరీ రాజిరెడ్డి, ఎన్.రమాకర్ , ఫార్మర్స్ ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ,మరియు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీ లేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి.

- ఒకే రోజు జిల్లా లోని మహిళలకు 8.80 కోట్ల రూపాయల
- వడ్డీ డబ్బులు విడుదల.
- మహిళా సాధికారితే ప్రభుత్వ ధ్యేయం
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**మెదక్,నవంబర్,24,మెదక్ టుడే న్యూస్: ప్రతినిధి** వడ్డీ లేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని, మహిళా సాదికారిత ప్రభుత్వ ప్రధాన ద్వేయం అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,37,438 మంది స్వయం సహాయక బృందాల లో అర్హులైన మహిళలకు వడ్డీ లేని రుణాలకింద 8 కోట్ల 80 లక్షల వడ్డీని బ్యాంకు లీ%శీ%కేజీ పై మహిళల అకౌంట్లో పండుగ వాతావరణం ల రేపు అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ వడ్డీలేని రుణాలు మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో మహిళలు ముందుకు రావాలని ఆయన సూచించారు. 2023- 24 సంవత్సరానికి 8.68 కోట్లు, 2024 - 25 సంవత్సరానికి 13.01 కోట్ల రూపాయ తో కలుపుకొని రేపు ప్రబుత్వం విడుదల చేస్తున్న 8.80 కోట్ల వడ్డితో మొత్తం 30 కోట్ల 40 లక్షల వడ్డీ డబ్బులు వడ్డీలేని రుణాల పథకం కింద మన జిల్లాలో మహిళలకు ఇప్పటివరకు అందాయన్నారు.

# కార్మికులు బీమా సదుపాయన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**






**మెదక్,నవంబర్,24,మెదక్ టుడే న్యూస్: ప్రతినిధి** భవన , ఇతర నిర్మాణ కార్మికులు కార్మిక బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో కార్మిక శాఖ కార్యాలయంలో కార్మిక భీమా పెంపు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల బీమా పెంపు సదస్సులు ఈనెల 24 నుంచి వచ్చేనెల 8వ తారీకు వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు సహజ మరణం సంభవిస్తే ఒక లక్ష నుండి రెండు లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు మరణిస్తే 6 లక్షల నుండి పది లక్షల వరకు పెంచారని, ప్రమాదవశత్తు పూర్తి శాశ్వత అంగవైకల్యంనకు 5 లక్షలు, పాక్షిక అంగవైకల్యం 4 లక్షలు, కార్మికుల పిల్లల వివాహ కానుకగా మొదటి ఇద్దరి కూతుళ్లకు 30,000, కార్మికుల మొదటి ఇద్దరి కూతుళ్లకు ప్రసూతి కానుకగా 30,000, రిజిస్ట్రేషన్ కాని కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే 50,000 తో పాటు ఇతర బీమా సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. కార్మికులు ఈ బీమా పెంపు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఇన్చార్జ్ సహాయ కార్మిక అధికారి సత్యేంద్ర ప్రసాద్, అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు,రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని, అధికారులు సమన్వయం గా పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్...






**మెదక్,నవంబర్,24,మెదక్ టుడే న్యూస్: ప్రతినిధి** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్పంచ్ ఎన్నికల కి సంబందించి, రిటర్నింగ్ అధికారులు,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకి ఎన్నికల విధులు, బాధ్యత లు, నియమ నిబంధన ల పైన శిక్షణహొ కార్యక్రమంహొ ను జిల్లా కలెక్టర్ అదన కలెక్టర్ రెవిన్యూ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి , జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తో కలిసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్హొ మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు తమకు ఇచ్చిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు.హొఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి బాధ్యత, రిటర్నింగ్ అధికారిదేనని, బాధ్యతగా విధులు నిర్వహిస్తూ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ సిబ్బంది నియామకం, వారికి పోలింగ్ కు సంబంధించిన సామాగ్రి సమకూర్చడం మొదలగు ప్రతి అంశాలను క్షుణ్ణం గా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. అధికారులు బ్యాలెట్ బాక్స్ ల గురించి, నామినేషన్ ప్రక్రియ గురించి, పోలింగ్ నిర్వహణ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహిళామణులు ఆర్థికంగా బలపడేందుకు స్వయం సమృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ఇందిరా మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్..







**మెదక్,నవంబర్,24,మెదక్ టుడే న్యూస్: ప్రతినిధి** అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గ్ మండలంలో రేగోడు ,టేక్మాల్ అల్లాదుర్గం రేగోడు మండలాలకు సంబంధించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి మెదక్ ఆర్డీవో రమాదేవి జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు 500 కోట్లు రుణాలు బ్యాంకు లింకేజీ ద్వారా అందించామన్నారు. ఉచిత విద్యుత్,500 రూపాయలకు గ్యాస్ సబ్సిడీ 13 కోట్ల రూపాయలను లక్ష 26 వేల కుటుంబాలకు అందించామన్నారు. జిల్లాలో 9,000 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి, మహాలక్ష్మి ద్వారా మహిళకు ఉచిత ప్రయాణం లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాను మహిళల అందించి వారిని కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీతో పండుగ వాతావరణం.. నెలకొందని చెప్పారు.మహిళల ఉన్నతి - తెలంగాణ ప్రగతి అనే కార్యక్రమం కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఉత్సవంలా పండుగలా ఊరూరా నిర్వహిస్తున్నామన్నారు.మహిళలు గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వం. రాష్ట్రంలోని కోటి మంది మహిళా మణులను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే మహోన్నత లక్ష్యంతో ముందుకు పోతుందన్నారు.మహిళా ఉన్నతి %-% తెలంగాణ ప్రగతి పేరిట 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చీరల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత మహిళలకు తొలి విడతలో చీరలను పంపిణీ చేస్తున్నారని, పట్టణ ప్రాంతాలలో మార్చి 1వ తేదీ నుండి వారం రోజుల పాటు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. మహిళా సంఘాలలోని సభ్యులకు రుణాలు అందిస్తూ నిలదొక్కుకునేందుకు మార్గం సుగమం చేసింది. రుణాలు అందించి.. చేయూత ఇస్తుంది అని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఇప్పటికే లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని వెల్లడించారు. అనంతరం అల్లాదుర్గ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ కార్యాలయాన్ని పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నికలను పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు.

# కొల్చారం పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ. శ్రీనివాస రావు..




**మెదక్,నవంబర్,24,మెదక్ టుడే న్యూస్: ప్రతినిధి** సాయంత్రం వాహనాల తనిఖీలు తప్పనిసరి. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేయాలి. గ్రామాల్లో సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మొదటగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ ఆవరణ పరిశుభ్రతపై సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరు గురించి కూడా ఎస్‌హెచ్‌ఓ నుండి వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరోజూ సాయంత్రం వాహనాల తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వాహణలో అంకితభావంతో పని చేయాలని, ఎవరికైతే ఏ విధులు కేటాయించబడతాయో వాటిని సమయానికి పూర్తి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయి అని హెచ్చరించారు. సిబ్బంది యొక్క పిల్లల చదువులను అడిగి తెలుసుకున్నారు.విధుల పరంగా ఎలాంటి సమస్య ఉన్నా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. రానున్న ఎన్నికల సమయంలో పూర్తిస్థాయి సంసిద్ధతతో ఉండాలని, మండలాలు మరియు గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలు, సామాజిక విఘాతం కలిగించే అంశాలపై సమగ్ర సమాచారం రాబట్టేందుకు పటిష్టమైన సమాచార వ్యవస్థను నిర్మించుకోవాలని సిబ్బందికి సూచించారు.గ్రామాల్లో ప్రజలకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్, వుమెన్ హరాస్మెంట్ వంటి సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రూరల్ సీఐ జర్జ్ గారు మరియు కూల్చారం ఎసై అహ్మద్ మోహినొద్దీన్ గారు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందిన యువకుడు




**చేగుంట నవంబర్ 24 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం మక్క రాజుపేట గ్రామంలో హర్షద్ అహ్మద్ వయస్సు 40 సంవత్సరాలు ఒక సంవత్సరం నుండి తన అత్తగారైన మకరాజుపేట గ్రామానికి వచ్చి పెయింటింగ్ పనులు చేసుకుంటూ బ్రతుకు జీవనం సాగించేవాడు ఆదివారం రాత్రి కాలకృత్యాలు కోసమని తన ఇంటి సమీపంలో గల చాన్కాన్ కుంటలో వెళ్ళగా కాలుజారి అందులో పడి చని పోయాడు అతడికి ఒక కుమారుడు ఒక కూతురు కలదు అని భార్య తహే ర బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు

# ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా 12 పిర్యాదులను స్వికరించిన జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు..




**మెదక్,నవంబర్,24,మెదక్ టుడే న్యూస్: ప్రతినిధి** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను, వివాదాలను, పోలీసు సంబంధిత ఇబ్బందులను జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ కి నేరుగా వివరించారు. కార్యక్రమంలో ఎస్పీ ఒక్కొక్క ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలపై పూర్తి వివరాలు తెలుసుకుని, సమస్య లను క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్‌ఇన్స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కొన్నింటిపై సంబంధిత ఎస్.ఎచ్.ఓ లతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని, చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడం మా ప్రధాన బాధ్యతని, పోలీస్ వ్యవస్థ ప్రజల కోసం ఉందని, ఎవరి జోక్యం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని,ఇప్పటికే ప్రజావాణి ద్వారా పరిష్కారమైన అనేక కేసులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచాయని ఎస్పీ తెలిపారు.

# పంచాయతీ సెక్రెటరీ వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఆదుకోండి




చేగుంట నవంబర్ 24 మెదక్ టుడే న్యూస్ న్యూస్ మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చేగుంట మండలం పోలంపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న కొండి లక్ష్మి వైఫ్ ఆఫ్ ఆంజనేయులు కుటుంబానికి హామీ ఇచ్చిన ఆర్డీవో,తహసిల్దార్,ఎంపీడీవో, డి ఎల్ పి ఓ,ఒక ఎకరా ప్రభుత్వ భూమి ఇవ్వాలని కలెక్టర్ ను కలవడం జరిగినది. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండి స్వామి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శ్యామల అశోక్,డిపిఎఫ్ నాయకులు సంజు, మాల మహానాడు శంకరంపేట్ మండల అధ్యక్షుడు సంజు,దళిత నాయకులు పాల్గొనడం జరిగింది.

# సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో ప్రమాదం

హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ప్రాంతంలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రి భవనంలో జరిగిన ఒక ఘోర ప్రమాదం ముగ్గురు కార్మికుల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఆస్పత్రిలోని అత్యవసర విభాగం (ఎమర్జెన్సీ వార్డు) భవనంలో పునర్నిర్మాణ పనులు జరుగుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పనులు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా సెంట్రింగ్ కూలిపోవడంతో.. అక్కడ పనిచేస్తున్న కార్మికులు దాని కింద చిక్కుకుపోయారు. ఆస్పత్రి అధికారులు భవనానికి మరమ్మతులు, పునర్నిర్మాణ పనులను చేపట్టారు. ఈ క్రమంలో కూలిన సెంట్రింగ్‌తో పాటు.. బలంగా ఉన్న పైకప్పు (స్లాబ్) పెచ్చులు ఊడి కార్మికులపై పడ్డాయి. ఈ హఠాత్తు సంఘటనతో అక్కడి వాతావరణం భయానకంగా మారిపోయింది. సెంట్రింగ్ కూలడంతో దాని కింద చిక్కుకుపోయిన ముగ్గురు కార్మికులు తీవ్ర గాయాలపాలై.. ఆసుపత్రిలోనే చికిత్స పొందుతూ దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. ప్రాణాలు కోల్పోయిన కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వలస కూలీలుగా గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భవన నిర్మాణ సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించారా? లేదా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి.. తదుపరి చర్యలు తీసుకుంటున్నారు.

ఈ ఘటనకు బాధ్యులైన కాంట్రాక్టర్‌పై, ఆస్పత్రి ఇంజనీరింగ్ విభాగం అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. సాధారణంగా.. భవన నిర్మాణ లేదా పునర్నిర్మాణ పనులు చేసేటప్పుడు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. హెల్మెట్లు, భద్రతా తాడులు (సేఫ్టీ బెల్ట్స్), పటిష్టమైన సెంట్రింగ్ వ్యవస్థను ఉపయోగించడం తప్పనిసరి. కానీ.. సెంట్రింగ్ కూలిపోవడం బట్టి, పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ భద్రతా నిబంధనలను ఉల్లంఘించిందని స్పష్టమవుతోంది. ప్రమాదానికి గురైన ఎమర్జెన్సీ వార్డు భవనం పాతది కావడంతో.. దాని పునర్నిర్మాణంలో మరింత జాగ్రత్త వహించాల్సి ఉంది. ఈ ప్రమాదానికి గురైన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున తగిన పరిహారం (ఎక్స్-గ్రేషియా) అందించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు.. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ భవన నిర్మాణ పనులపై పర్యవేక్షణను, భద్రతా ప్రమాణాల అమలును కట్టుదిట్టం చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిర్మాణ రంగంలో కార్మికుల భద్రతను నిర్ధారించేందుకు తనిఖీలను మరింత కఠినతరం చేయాలని కోరుతున్నాయి.

MEDAK TODAY TELUGU DAILY తెలుగు దినపత్రిక

# బిజినెస్

## ఆల్ టైమ్ కనిష్ఠానికి రూపాయి.. ఒక్కరోజే భారీగా పతనం




డాలర్ వద్ద భారత కరెన్సీ రూపాయి చారిత్రక కనిష్ఠానికి పతనమైంది. శుక్రవారం డాలర్ తో పోలిస్తే.. రూపాయి విలువ ఏకంగా 98 పైసలు నష్టపోయి..రూ.89.66 వద్ద ముగిసింది. రూపాయి విలువ 89 మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి. 2022 ఫిబ్రవరి 24న రూపాయి 99 పైసలు నష్టపోయింది. గడిచిన మూడేళ్లలో ఎన్నడూలేని రీతిలో ఒక్కరోజులోనే రూపాయి 98 పైసలు నష్టపోయింది. ఏడాది కాలంలో ఇప్పటి వరకూ రూపాయి విలువ 4.6 శాతం మేర క్షీణించి.. ఆసియాలోనే అత్యంత బలహీనపడిన కరెన్సీగా నిలిచింది. దిగుమతిదారుల నుంచి డాలర్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరగడం, అంతర్జాతీయ డాలర్ ఇండెక్స్ బలపడటం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేస్తుండటంతో అమెరికా ఆంక్షలు విధించడం, టెక్నాలజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, విదేశీ పెట్టుబడుల తరలింపు వంటి అంశాలు కూడా ప్రతికూలమైన ప్రభావం చూపాయి. త్వరలోనే రూపాయి విలువ 90 మార్క్ ను కూడా దాటవచ్చని యా వెల్త్ గ్లోబల్ రీసెర్చ్ డైరెక్టర్ అనూజ్ గుప్తా అంచనా వేశారు.

## అమెజాన్ యాప్‌లో 'ప్రైస్ హిస్టరీ' పేరుతో కొత్త ఫీచర్



ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వినియోగదారుల కోసం ఒక కీలకమైన, సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. షాపింగ్ ప్రియులకు ఎంతగానో ఉపయోగపడే 'ప్రైస్ హిస్టరీ' ఫీచర్‌ను తన మొబైల్ యాప్‌లో ప్రవేశపెట్టింది. దీని సహాయంతో వినియోగదారులు ఒక వస్తువు ధర గత 30 నుంచి 90 రోజుల్లో ఎంత పెరిగింది లేదా ఎంత తగ్గింది అనే విషయాన్ని సులభంగా తెలుసుకోవచ్చు.ఇంతకుముందు ఒక వస్తువు ధరల చరిత్రను విశ్లేషించాలంటే కస్టమర్లు థర్డ్ పార్టీ యాప్‌లు లేదా ఇతర వెబ్‌సైట్లపై ఆధారపడాల్సి వచ్చేది. ఈ ఇబ్బందికి చెక్ పెడుతూ అమెజాన్ ఇప్పుడు తన యాప్‌లోనే ఈ సదుపాయాన్ని కల్పించింది. వినియోగదారులు ఏదైనా ప్రొడక్ట్‌ను ఎంపిక చేసుకుని, పేజీలో కిందికి స్క్రోల్ చేస్తే ధర వివరాల పక్కనే 'ప్రైస్ హిస్టరీ' ఆప్షన్ కనిపిస్తుంది.దానిపై క్లిక్ చేయగానే, గత 30 నుంచి 90 రోజుల మధ్య ఆ వస్తువు నమోదైన కనిష్ఠ, గరిష్ఠ ధరలను ఒక గ్రాఫ్ రూపంలో స్పష్టంగా చూపిస్తుంది. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక సేల్స్ సమయాల్లో ఈ ఫీచర్ కొనుగోలుదారులకు సరైన నిర్ణయం తీసుకోవడానికి ఎంతగానో సహాయపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# జీఎస్టీ తగ్గించినా ధరలు ఎందుకు తగ్గలే




చాలా రకాల వస్తువులపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రేట్లను గత సెప్టెంబర్ నెలలో కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. జీఎస్టీ మండలి ఏదైనా వస్తువు లేదా సేవపై జీఎస్టీ రేటును తగ్గించినప్పుడు వినియోగదారులు ఆయా వస్తువుల ధరలు తగ్గాలని సహజంగా భావిస్తారు. సెక్షన్ 171లోని యాంటీ ప్రాఫిటీరింగ్ రూల్ ప్రకారం పన్ను ఏ మేరకు తగ్గుతుందో ఆ స్థాయిలో వినియోగదారులకు ప్రయోజనం అందించాలి. అయితే, వాస్తవంలో చాలా సందర్భాల్లో పన్ను తగ్గింపు ప్రయోజనం పూర్తిగా వినియోగదారులకు చేరడం లేదు.దీని వెనుక ఉన్న కారణాలను విశ్లేషిస్తూ ప్రముఖ ఆర్థికవేత్తలు పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.తయారీ ఖర్చుల పెరుగుదల కారణంగా పన్ను రేటు తగ్గినా వస్తువులను తయారు చేయడానికి అయ్యే ముడి సరుకు ఖర్చులు, కార్మిక వ్యయాలు, ఇంధన ధరలు వంటి ఇతర ఉత్పత్తి వ్యయాలు పెరిగితే కంపెనీలు ధరలు తగ్గించలేవు. ఇలా తయారీ వ్యయాల పెరుగుదలతో పన్ను తగ్గింపు ప్రయోజనం వినియోగదారులకు అందించలేరు.అధిక లాభాల లక్ష్యం మరో కారణం. కొన్ని కంపెనీలు ముఖ్యంగా మార్కెట్‌లో బలమైన పట్టు ఉన్నవి జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించకుండా ఆ తగ్గింపు మొత్తాన్ని తమ లాభాల మార్జిన్‌ను పెంచుకోవడానికి ఉపయోగిస్తాయి. పన్ను తగ్గినా, ధరను పాత స్థాయిలోనే ఉంచుతాయి. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సమస్యలు కూడా మరో కారణంగా చెప్పవచ్చు. కొన్నిసార్లు జీఎస్టీ రేటు తగ్గించినప్పుడు కంపెనీలు తీసుకునే ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ మొత్తం తగ్గిపోవచ్చు. ఫలితంగా తయారీకి అయ్యే మొత్తం ఖర్చులో పెరుగుదల కనిపించవచ్చు. ఈ భారాన్ని కంపెనీలు తుది ఉత్పత్తి ధరపై వేస్తాయి. దీంతో ధరల తగ్గుదల పెద్దగా కనిపించదు. కొన్ని వస్తువులపై జీఎస్టీ కోతలు కేవలం కొన్ని నిర్దిష్ట రకాల ఉత్పత్తులకు మాత్రమే వర్తిస్తుంటాయి. కానీ మొత్తం కేటగిరీకి వర్తించకపోవచ్చు. ఈ విధానపరమైన సంక్లిష్టత కారణంగా వ్యాపారులు మొత్తం ధరలను తగ్గించడానికి ఆసక్తి చూపరు. మరోవైపు మార్కెట్‌లో బలమైన పోటీ లేకపోతే ధరలను తగ్గించాల్సిన అవసరం కంపెనీలకు ఉండదు. పన్ను తగ్గింపు ప్రయోజనం కచ్చితంగా వినియోగదారులకు చేరాలంటే ఆ మార్కెట్‌లో ఆరోగ్యకరమైన, తీవ్రమైన పోటీ ఉండాలి. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు వినియోగదారులకు చేరేలా చూసేందుకు నేషనల్ యాంటీ ప్రాఫిటీరింగ్ అథారిటీ వంటి సంస్థలను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ దేశంలో వందల కోట్ల లావాదేవీల పర్యవేక్షణ ఈ సంస్థకు సవాలుగా మారింది. కేవలం పన్ను కోత మాత్రమే కాకుండా ఉత్పత్తి వ్యయాలు, మార్కెట్ పోటీ, వ్యాపారుల లాభాల ధోరణి వంటి అంశాలు తుది ధరలపై నిర్ణయాత్మక ప్రభావం చూపుతాయి. ఈ సమస్యలను పరిష్కరించగలిగితే జీఎస్టీ పన్ను తగ్గింపు ప్రయోజనాలను గరిష్ఠ స్థాయిలో వినియోగదారులకు చేరేలా చేయవచ్చని ఆర్థికవేత్తలను సూచిస్తున్నారు.

# ఏడాది దాటితే గ్రాట్యుటీ.. కొత్త లేబర్ కోడ్స్‌లో మార్పులివే



మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉద్యోగుల సంక్షేమం, భద్రతకు పెద్ద పీట వేస్తూ కేంద్రం ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ (కార్మిక స్మృతులు) నోటిఫై చేసింది. దశాబ్దాలుగా అమలులో ఉన్న 29 పాత కార్మిక చట్టాల స్థానంలో వీటిని రూపొందించింది. దేశవ్యాప్తంగా తక్షణమే అమలులోకి తీసుకొస్తున్నట్లు శుక్రవారం ప్రకటన చేసింది. కార్మిక చట్టాల విషయంలో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ సంస్కరణలు ఉద్యోగుల భద్రత, సామాజిక భద్రత, మహిళా సాధికారత, సమాన వేతనాలు సహా అసంఘటిత రంగ కార్మికులకు ప్రధానంగా గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్లకు రక్షణ కల్పించడంలో కీలక మైలురాయిగా చెప్పవచ్చు. కొత్త లేబర్ కోడ్స్ అమలులోకి వచ్చిన క్రమంలో ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో ప్రతి ఒక్కరు కచ్చితంగా తెలుసుకోవాలి. కొత్త చట్టాల్లోని కొన్ని ముఖ్యమైన అంశాలు పరిశీలిస్తే ప్రధానంగా ఉద్యోగులందరికీ నియామక పత్రాలు తప్పనిసరి చేసింది. దీంతో ఉద్యోగ భద్రత, పారదర్శకత, స్థిరమైన ఉపాధికి లిఖితపూర్వకంగా హామీ లభిస్తుందని కేంద్రం పేర్కొంది. అలాగే గిగ్, ప్లాట్ ఫామ్ కార్మికులు సహా ఉద్యోగులందరికీ సామాజిక భద్రత పథకాలైన ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐసీ, బీమా వంటివి కల్పించాల్సి ఉంటుంది.ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు ఇకపై శాశ్వత ఉద్యోగులతో సమానంగా అన్ని ప్రయోజనాలు కల్పించాల్సి ఉంటుంది.ఎఫ్‌టీఈ ఉద్యోగులకు 5 సంవత్సరాలకు బదులుగా కేవలం 1 ఏడాది సర్వీస్ పూర్తయిన తర్వాతే గ్రాట్యుటీకి అందించాలి.కార్మికులు అందరికీ కనీస వేతనం అనేది చట్టబద్ధమైన హక్కుగా మారింది.కంపెనీల యజమానులు సకాలంలో వేతనాలు చెల్లించడం తప్పనిసరి.ఐటీ ఉద్యోగులకు నెలలో 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించాల్సిందే.బీడీ, సిగరెట్, మైనింగ్ పరిశ్రమల్లో పని చేసే వారు 8-12 గంటల వరకు పని చేయొచ్చు. వారానికి 48 గంటలు మించకూడదు. 30 రోజుల పని పూర్తి చేసుకున్నట్లయితే బోనస్ పొందేందుకు అర్హత లభిస్తుంది.40 సంవత్సరాలు దాటిన ఉద్యోగులకు యాజమాన్యాలు ఉచిత వార్షిక వైద్య పరీక్షలు అందించడం తప్పనిసరి.సమాన పనికి సమాన వేతనం తప్పనిసరి. సంస్థలో ట్రాన్స్‌జెండర్ సహా లింగ వివక్ష చట్టబద్ధంగా నిషేధం. సాధారణ పని గంటలు దాటి పని చేసినట్లయితే రెగ్యులర్ వేతనానికి రెట్టింపు వేతనం చెల్లించాల్సి ఉంటుంది. రాత్రి షిఫ్టుల్లో, అన్ని రకాల పనుల్లోనూ (అండర్ గ్రౌండ్ మైనింగ్ సహా) మహిళలకు అనుమతి. అయితే, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలి, మహిళల సమ్మతి తప్పనిసరి.

# స్పోర్ట్స్

## ముగిసిన తొలి రోజు ఆట..

# సఫారీలదే పై చేయి




గువహటి వేదికగా భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు ఆటలో సౌతాఫ్రికా పై చేయి సాధించింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో ముత్తుసామి (25బి), వెర్రిన్ (1బి) ఉన్నారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రోటీస్ జట్టుకు ఓపెనర్లు మార్క్రమ్ (38), రికెల్టన్ (35) శుభారంభాన్ని అందించారు. బ్యాటర్లకు అనుకూలంగా ఉండే విధంగా పిచ్ తయారు చేయడంతో తొలి వికెట్‌ను సాధించేందుకు భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. జస్ప్రీత్ బుమ్రా అద్భుతమైన బంతితో మార్‌క్రమ్‌ను ఔట్ చేయడంతో భారత్‌కు తొలి వికెట్ లభించింది. అనంతరం ట్రిస్టన్ స్టబ్స్ (49), కెప్టెన్ టెంబా బవుమా (41) నిలకడగా ఆడి ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే రెండో సెషన్‌లో మాత్రం భారత బౌలర్లు పుంజుకున్నారు. ముఖ్యంగా స్పిన్నర్లు కీలక వికెట్లు పడగొట్టారు. రికెల్టన్, స్టబ్స్, ముల్డర్‌లను కుల్దీప్ యాదవ్ పెవిలియన్‌కు పంపగా.. బవుమాను జడ్డూ బోల్తా కొట్టించాడు. భారత బౌలర్లలో ఇప్పటివరకు కుల్దీప్ యాదవ్ మూడు వికెట్లు పడగొట్టగా.. జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, జడేజా తలో వికెట్ దక్కించుకున్నారు.

## ఒక గ్రూప్‌లో ఐదు జట్లు.. ఆతిథ్య దేశాలతో తలపడేది ఎవరంటే..?




వచ్చే ఏడాది భారత్, శ్రీలంక పురుషుల పొట్టి ప్రపంచకప్ టోర్నీ నిర్వహిస్తున్నాయి. ఫిబ్రవరి 7న విశ్వ క్రీడా సమరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి(%×జజ%) ఇప్పటికే ఇరుదేశాల్లో కలిపి8 నగరాలను ఎంపిక చేసింది. తాజాగా టోర్నీలో ఆడనున్న 20 జట్లను నాలుగు గ్రూప్‌లుగా చేసింది ఐసీసీ. ఆతిథ్య జట్లైన టీమిండియా, శ్రీలంక గ్రూప్ దశలో కఠిన ప్రత్యర్థులతో తలపడనున్నాయి. ఈసారి కూడా దాయాదులైన భారత్, పాక్ ఒకే గ్రూప్‌లో ఉండడంతో మరో ఉత్కంఠ పోరుకోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పొట్టి వరల్డ్ కప్ నిర్వహణ పనుల్లో వేగం పెంచింది ఐసీసీ. టోర్నీకి సమయం దగ్గరపడుతున్నందున వేదికలను ఖరారు చేసిన ఐసీసీ శనివారం 20 జట్లను గ్రూప్‌లుగా విభించింది. ఒక్కదాంట్లో ఐదు చొప్పున నాలుగు గ్రూప్‌లను చేసింది. ఆతిథ్య దేశమైన టీమిండియా గ్రూప్‌లో పాకిస్థాన్ మాత్రమే పెద్ద జట్టు. కానీ, శ్రీలంక గ్రూప్‌లో ఆస్ట్రేలియా ఉండడంతో ఆ జట్టుకు కఠిన సవాల్ ఎదురవ్వనుంది. ఇక గ్రూప్ 3లో ఇంగ్లండ్, వెస్టిండీస్.. గ్రూప్ 4లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ వంటి టెస్టు క్రికెట్ ఆడే జట్లు ఉన్నాయి.

గ్రూప్ -1 : భారత్, పాకిస్థాన్, నెదర్లాండ్స్, నమీబియా, యూఎస్ఏ.
గ్రూప్ -2 : శ్రీలంక, ఆస్ట్రేలియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఒమన్.
గ్రూప్ -3 : ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, నేపాల్, ఇటలీ.
గ్రూప్ -4 : దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్, యూఏఈ, కెనడా.

## యాషెస్‌లో ఓ అరుదైన టెస్టు.. చరిత్రను తిరగరాసిన హెడ్, స్టార్క్..!




యాషెస్ సిరీస్‌లో కనీవినీ ఎరుగని అద్భుతం ఆవిష్కృతమైంది. పేసర్ల వికెట్ల వేటతో ఉత్కంఠ రేపిన పెర్త్ టెస్టు ఆశ్చర్యంగా రెండోరోజే ముగిసింది. తొలి రోజే 19 వికెట్లు పడడం ఒక రికార్డు అయితే.. ఆతిథ్య ఆసీస్ గెలుపొందడం మరో రికార్డు. మొత్తానికి యాషెస్ వందేళ్ల చరిత్రలోనే అరుదైన మ్యాచ్‌గా పెర్త్ టెస్టు పుస్తకాల్లోకెక్కింది. పేసర్లు వికెట్ల పండుగ చేసుకున్న చోట ఒకేఒక్కడు ఇంగ్లండ్ నుంచి విజయాన్ని లాక్కున్నాడు. తన అసాధారణ విధ్వంసంతో ఓపెనర్ ట్రావిస్ హెడ్ బంతితో చెమటలు పట్టించిన మిచెల్ స్టార్క్ చరిత్రను తిరగరాశారు. పెర్త్ మ్యాచ్‌లో బద్ధలైన రికార్డులేంటో చూద్దాం.. టెస్టు ఫార్మాట్లోని అతిపెద్ద సిరీస్‌లలో ఒకటైన యాషెస్ ఆరంభం 'నభూతో న భవిష్యత్' అనే చెప్పాలి. ఆసీస్ గడ్డపై సిరీస్ విజయంపై గంపెడు ఆశలతో విమానమెక్కి వచ్చిన బెన్ స్టోక్స్ బృందానికి పెద్ద షాక్ తగిలింది. తొలి రోజే 19 వికెట్లు పడడంతో మ్యాచ్ ఫలితం రెండు మూడు రోజుల్లోనే తేలిపోనుందనే అంచనాకు వచ్చారంతా. ఇంగ్లండ్ ఆటగాళ్లు, కంగారూ టీమ్‌లోని స్టార్లు అపసోపాలు పడ్డచోట ట్రావిస్ హెడ్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఇంగ్లీష్ బౌలింగ్ దళాన్ని కకావికలం చేసిన ఈ చిచ్చరపిడుగు 69 బంతుల్లోనే శతకంతో ఆసీస్ విజయంలో కీలకమయ్యాడు. అంతే.. రెండు రోజుల్లోనే మ్యాచ్ ముగిసి.. ఆతిథ్య ఆస్ట్రేలియా 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రికార్డుల విషయానికొస్తే.. ఐదోరోజులు రసవత్తర పోరాటం చూడాలనుకున్న అభిమానులకు పెర్త్ టెస్టు రెండో రోజే మ్యాచ్ ముగిసింది. ఇలా రెండురోజుల్లోనే ఫలితం తేలడం ఈ సిరీస్ వందేళ్ల చరిత్రలో ఇదే తొలిసారి. ఇదివరకూ 1921లో ట్రెంట్‌బ్రిడ్జ్‌లో మ్యాచ్ సైతం రెండు రోజుల్లోనే ముగిసింది. బంతుల పరంగానూ పెర్త్ టెస్టు రికార్డు పట్టేసింది. ఈ మ్యాచ్‌లో 847 బంతుల్లోనే మ్యాచ్ పూర్తైంది. యాషెస్ చరిత్రలో ఇంత తక్కువ బంతులు వేయడం ఇది మూడోసారి మాత్రమే. 1888లో ఇంగ్లండ్ గడ్డపై 788 బంతుల్లోనే మ్యాచ్ ముగియగా.. 1894-95 సిడ్నీలో 911 బంతుల్లోనే విజేత ఎవరో తేలిపోయింది.

Printed Published and owned by **CHILVERA SHIVAKUMAR** and Printed **JWAALA PRINTERS** H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303-
Gmail.“medaktoday94@gmail.com,Editor: **CHILVERA SHIVAKUMAR**. RNI NO.: **TELTEL/2023/88524**, 9948265095, 9494117870